క్లుప్తంగా

రామపాదుకల దర్శనం



అలకాపూర్ టౌన్‌షిప్‌లో రామ పాదుకలను దర్శించుకున్న భక్తులు

మణికొండ: అయోధ్య రామాలయంలో పూజలందుకునే రామపాదుకలను ఆదివారం మణికొండ మున్సిపాలిటీ ప్రజలు దర్శించుకున్నారు. మున్సిపాలిటీ పరిధిలోని అలకాపూర్ టౌన్‌షిప్ ఎంజీ పార్కులో ఏర్పాటు చేసిన వినాయక మండపానికి వాటిని రప్పించారు. ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు వాటిని భక్తుల దర్శనార్థం ఉంచారు. అలకాపూర్ టౌన్‌షిప్ వాసులతో పాటు మణికొండ మున్సిపాలిటీ ప్రజలు పెద్ద ఎత్తున రామపాదుకలకు ప్రత్యేక పూజలు నిర్వహించి దర్శనం చేసుకున్నారు. కార్యక్రమంలో అలకాపూర్ టౌన్‌షిప్ సంక్షేమ సంఘంతో పాటు వినాయక మండప నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయిలో సత్తా చాటిన జిల్లా రెజ్లర్‌లు



చాంపియన్‌లుగా నిలిచిన జిల్లా రెజ్లింగ్ క్రీడాకారులు

మణికొండ: వరంగల్‌జిల్లా హన్మకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ ఇండోర్ స్టేడియంలో ఆదివారం జరిగిన రాష్ట్ర స్థాయి అండర్ 17 బాల,బాలికల స్కూల్ గేమ్స్ ఫెడరేషన్‌లో జిల్లా రెజ్లర్‌లు రాణించారు. బాలుర విభాగంలో అత్యధిక పతకాలను సాధించి ఓవరాల్ చాంపియన్‌లుగా నిలవగా, బాలికలు రెండో స్థానంలో నిలిచారని కోచ్ రాజ్‌కుమార్ తెలిపారు. బాలబాలికలు 4 బంగారు, 7 రజత, 6 కాంస్య పతకాలను సాధించారన్నారు. వీరు రాబోయే రోజుల్లో జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని రాణిస్తారన్నారు. పతకాలు సాధించిన బాలబాలికలను మేనేజర్ ప్రశాంత్, కోచ్ రాజ్‌కుమార్, జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు కస్తూరి యాదయ్య, ప్రధాన కార్యదర్శి కృష్ణ అభినందించారు.

భక్తిరంజకంగా భజన కీర్తనల పోటీలు



భజన కీర్తనలు పాడుతున్న చిన్నారులు

శంషాబాద్: పట్టణంలోని సరస్వతి శిశుమందిర్ పాఠశాలలో ఆదివారం భజనకీర్తనల పోటీలు భక్తిరంజకంగా సాగాయి.. విశ్వహిందు పరిషత్, భాగ్యనగర్ గణేష్ ఉత్సవసమితి, ధర్మజాగరణ్ సౌజన్యంతో భజనభారి శంషాబాద్ శాఖ ఏర్పాటు చేసిన పోటీల్లో శంషాబాద్, పద్మశాలిపురం, లక్ష్మీగూడ భజన బృందాల తరఫున చిన్నారులు భజన సంకీర్తనలను ఆలపించారు. తుది పోటీలు ఈ నెల 27 నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఆనంద పోయెట్రీ లడ్డూ @రూ.1.71లక్షలు



వేలం పాటలో లడ్డూను దక్కించుకున్న నీలేష్ ప్రసాద్ దూబే కుటుంబ సభ్యులు

మణికొండ: మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని ఆనంద పోయెట్రీ గేటెడ్ కమ్యూనిటీ వినాయకుడి చేతిలోని లడ్డూ రూ. 1.71లక్షలు పలికింది. వినాయకుడిని ఆదివారం నిమజ్జనానికి తరలిస్తున్న క్రమంలో ఆయన చేతిలోని లడ్డూను ప్రతి సంవత్సరం మాదిరిగానే వేలం వేశారు. పోటాపోటీగా జరిగిన వేలం పాటలో బీఆర్‌ఎస్ మున్సిపాలిటీ ఉపాధ్యక్షుడు నీలేష్‌ప్రసాద్ దూబే దక్కించుకున్నారు. గత సంవత్సరం ఇదే లడ్డూను అతనే రూ. 1.51లక్షలకు దక్కించుకోగా ఈ సంవత్సరం అతనే రూ.1.71లక్షలకు రెండో సారి దక్కించుకున్నారు. వినాయక నవరాత్రి నిర్వాహకులు ఆయనకు లడ్డూను అందజేశారు.

రాజకీయాలకు అతీతంగా సేవా కార్యక్రమాలు

హఫీజ్‌పేట్ : శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలో ప్రాంతాలకు, పార్టీలకు అతీతంగా సేవలు అందించడమే ట్రస్టు లక్ష్యమని సందయ్య మెమోరియల్ ట్రస్టు చైర్మన్, మాజీ ఎమ్మెల్యే భిక్షపతి యాదవ్ అన్నారు. ఆదివారం చందానగర్ డివిజన్ పరిధిలోని వేముకుంటలో సందయ్య మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్ష శిబిరాన్ని నిర్వహించారు.



పద్మశ్రీహిల్స్‌లో..



మణికొండ హుడాకాలనీ వినాయక పూజలో పాల్గొన్న వైస్ చైర్మెన్ నరేందర్‌రెడ్డి తదితరులు



శివసాయి నగర్‌లో..

గణనాయకా..నీకు వందనం..



వినాయక్ నగర్ బస్తీలో ఏర్పాటు చేసిన వినాయకుడి పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

సాక్షి, రాజేంద్రనగర్ జోన్ బృందం: వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రాజేంద్ర నగర్ డివిజన్ పరిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు కాలనీల్లో ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. పలు ప్రాంతాల్లో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. గణేష మండపాల వద్ద చిన్నారుల సాంస్కృతిక నృత్యాలు అందరినీ అలరించాయి. శివరాంపల్లి నేతాజీ యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాధుడికి రాజేంద్రనగర్ డీసీపీ జగదీశ్వర్ రెడ్డి, ఏసీపీ గంగాధర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు.



పుప్పాలగూడ గోల్డెన్ ఓరియోల్‌లో..



మణికొండ క్వార్టర్స్‌లో

యాదాద్రి కాలనీ లడ్డూ రూ.1,02,145

నవరాత్రి ఉత్సవాల సందర్భంగా భక్తిశ్రద్ధలతో పూజలందుకున్న గణనాధుడి లడ్డూల వేలం ప్రారంభమైంది. యాదాద్రి కాలనీలో పూజలందుకున్న వినాయకుడి లడ్డూను అమర్‌నాథ్ రూ. 1,02146లకు కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఆయనను ఘనంగా సన్మానించి లడ్డూను అందజేశారు.



పోచమ్మ కాలనీలో..



బండ్లగూడ యాదవమిత్ర కాలనీలో..



నేతాజీ యువజన సంఘం ఏర్పాటు చేసిన వినాయక పూజలో పాల్గొన్న డీసీపీ జగదీశ్వర్ రెడ్డి



యాదాద్రి కాలనీలో లడ్డూను కైవసం చేసుకున్న అమర్‌నాథ్‌ను సన్మానిస్తున్న నిర్వాహకులు



బండ్లగూడ జాగీర్ సాయి శక్తి సింఫొనీ అపార్ట్‌మెంట్స్‌లో జరిగిన గణేష్ వేడుకల్లో పాల్గొన్న అపార్ట్‌మెంట్ వాసులు



కోకాపేట లాంజ్ అపార్ట్‌మెంట్‌లో చిన్నారుల కూచిపూడి నృత్యప్రదర్శన



చిన్నారులతో కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి



అల్కాపూర్ టౌన్‌షిప్‌లో...



వివేకానంద కాలనీలో పల్లకీ సేవ



నెక్నాంపూర్‌లో..



నార్సింగిలో..



పంచవటి కాలనీలో..



రాజేంద్రనగర్‌లో..

పొంచి ఉన్న ప్రమాదం

● పట్టించుకోని అధికారులు

మణికొండ: ఎలాంటి అనుమతులు లేకుండా సెల్లార్ తవ్వకాలను చేపట్టి పక్కనే ఉన్న మరో అపార్ట్‌మెంట్ భద్రతకు ముప్పును తెచ్చిన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని మణికొండ మున్సిపాలిటీ, అలకాపూర్ టౌన్‌షిప్ 8వ వార్డు కౌన్సిలర్ ఎ.నవీన్‌కుమార్ డిమాండ్ చేశారు. టౌన్‌షిప్ పరిధిలోని ప్లాట్‌నెంబర్ 285,286,287లలో జేఎస్‌ఆర్ బ్లూమ్స్ అపార్ట్‌మెంట్ పక్కనే ప్లాట్ నెంబర్ 292,293లలో ఇటీవల ఓ బిల్డర్ ఎలాంటి అనుమతులు లేకుండా సెల్లార్ తవ్వకం చేపట్టినట్లు తెలిపారు. దాంతో పక్కనే ఉన్న అపార్ట్‌మెంట్ పిల్లర్‌లు సైతం తేలడంతో సదరు అపార్ట్‌మెంట్ ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. అందులో నివసిస్తున్న వారు ఇప్పటికే మున్సిపల్ కార్యాలయంలో ఫిర్యాదు చేయగా తనిఖీలు చేపట్టిన టీపీఎస్ రాకేష్ వారి భూమిలో వారు సెల్లార్ తీసుకుంటే మీకేమి అభ్యంతరం అంటూ బిల్డర్‌కు వత్తాసు పలకడంతో అపార్ట్‌మెట్ వాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయం తన దృష్టికి తేవటంతో మున్సిపల్ కమిషనర్‌ను కలిసి సదరు బిల్డర్‌పై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని, అతనికి ఎలాంటి అనుమతులను జారీ చేయవద్దని కోరానన్నారు. అందుకు స్పందించిన కమిషనర్ చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారని, లేని పక్షంలో అపార్ట్‌మెంట్‌వాసులతో కలిసి మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.



సెల్లార్ తవ్వటంతో ప్రమాదకరంగా మారిన భవనం

అభివృద్ధికి అడ్డుపడితే ఉపేక్షించొద్దు

మణికొండ: చిత్రపురి హౌసింగ్ సొసైటీ అభివృద్ధి, పెండింగ్ పనుల పూర్తిని వ్యక్తిగత స్వార్థంతో అడ్డుకుంటున్న వారి సభ్యత్వాలను తొలగించాలని, వారికి ఇప్పటికే కేటాయించిన ఫ్లాట్‌లను రద్దు చేయాలని సభ్యులు తీర్మానించారు. ఆదివారం సొసైటీ అధ్యక్షుడు వల్లభనేని అనిల్‌కుమార్ అధ్యక్షతన చిత్రపురి కాలనీలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యులు కాలనీలో ప్రజావసరాల కొరకు చేపట్టాల్సిన పనులు, ఇప్పటికే మొదలై పూర్తి కాకుండా ఉన్న పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు మాట్లాడుతూ చిత్రపురి హౌసింగ్ సొసైటీతో పాటు కాలనీ అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. కొందరు వ్యక్తిగత స్వార్థంతో గత కమిటీ చేసిన తప్పులను ఎత్తి చూపుతూ కోర్టును ఆశ్రయించటంతో పనులు చేయలేకపోతున్నామన్నారు. దాంతో సభ్యులు అలాంటి వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని, తామంతా కమిటీకి అండగా ఉంటామని మద్దతు తెలిపారు.



మాట్లాడుతున్న అధ్యక్షుడు వల్లభనేని అనిల్‌కుమార్



సమావేశానికి హాజరైన సభ్యులు

రోడ్డు ఆక్రమణదారులపై కేసు నమోదు

శంషాబాద్: రోడ్డును కబ్జా చేయడమే కాకుండా దానిని పరిష్కరించేందుకు వచ్చిన వారిపై దాడికి యత్నించిన వారిపై శంషాబాద్ పోలీసులు కేసు నమోదు చేశారు. చిన్న గోల్కొండ సయ్యద్‌గూడ సర్వేనంబర్ 26బై6 లో దండేమూడి బయోటెక్ కంపెనీ యజమాన్యం ఆరుఎకరాల స్థలాన్ని కొనుగోలు చేసింది. భూములు విక్రయించిన ఎయిర్‌పోర్టు కాలనీకి చెందిన జనిగే గోపాల్, సిద్దులు, పర్వతాలు తదితరులు అక్కడే గులాబీ తోటను సాగు చేస్తున్నారు. ఈ విషయమై యజమాన్యం గతంలో అడ్డుకోగా బతుకుదెరువు కోసం చేస్తున్నామని చెప్పుకొచ్చారు. సదరు భూమి వెనక గతంలో ప్రభుత్వం వడ్డెర కులస్తులకు ఇళ్లు నిర్మించి ఇందులోంచి రోడ్డు ఏర్పాటు చేసింది. గొల్లపల్లి సర్వేనంబరు 261లో ఉన్న ప్రభుత్వ భూమికి కూడా ఇందులోంచే రోడ్డు ఉండగా ఇటీవల పేదలకు ఇళ్ల పట్టాల విషయమై కౌన్సిలర్ చెన్నం అశోక్ తదితరులు అక్కడికి వెళ్లగా జనిగే గోపాల్, పర్వతాలు, వెంకటేస్, సిద్దులు తదితరులు వారిపై దాడులకు పాల్పడ్డారు. దండెమూడి బయోటెక్ ఉద్యోగి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వ వైఫల్యంతోనే పరీక్ష రద్దు

శంషాబాద్: రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యం కారణంగానే మరోసారి గ్రూప్స్ ప్రిలిమ్స్ పరీక్ష రద్దయిందని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ చాకలి మహేష్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతోందన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పాలనలో ఉద్యోగ పరీక్షల దగ్గరి నుంచి సాధారణ పరీక్షల నిర్వహణ అస్తవ్యస్తంగా ఉందన్నారు. పేపర్ లీకేజీలు, వాటిని అమ్ముకోవడం సర్వసాధారణమయ్యాయన్నారు.
ప్రభుత్వం వెంటనే టీఎస్‌పీఎస్సీ రద్దు చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు.



గండిపేట గండెమ్మ దేవాలయం ఆవరణలో చెత్తను తొలగిస్తున్న అధికారులు, నాయకులు



స్వచ్ఛత ర్యాలీ నిర్వహిస్తున్న మున్సిపల్ ప్రజాప్రతినిధులు, అధికారులు, కార్మికులు

గండిపేటలో స్వచ్ఛత ర్యాలీ

మణికొండ: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు వార్డులు, మున్సిపాలిటీని స్వచ్ఛతలో అగ్రగామిగా నిలపాలని మున్సిపాలిటీ ప్రజాప్రతినిధులు, అధికారులు, కార్మికులు అన్నారు. నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని గండిపేట వార్డు కార్యాలయం నుంచి గండెమ్మ దేవాలయం వరకు ఆదివారం స్వచ్ఛతా ర్యాలీ నిర్వహించి దేవాలయ పరిసరాల్లో ప్లాస్టిక్, చెత్తా, చెదారాన్ని ఏరివేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ డి.రేఖయాదగిరి, కమీషనర్ బి.సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత పట్ల ప్రతి ఒక్కరిలో అవగాహన పెంపొందించేందుకే ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. మంచి పర్యావరణం, ఆరోగ్యం పరిశుభ్రత స్వచ్ఛతతోనే సాధ్యమవుతుందన్నారు. ఎక్కడ పడితే అక్కడ చెత్తను వేయటం మానుకోవాలన్నారు. ఇండియన్ స్వచ్ఛత లీగ్‌లో ఈ సంవత్సరం నార్సింగి మున్సిపాలిటీని అగ్రభాగంలో నిలిపేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మెన్ జి.వెంకటేశ్ యాదవ్, మున్సిపల్ మేనేజర్ యోగేష్, డీఈ నరసింహారాజు, ఏఈ శ్రీనివాస్, టీపీఎస్ పావని, కౌన్సిలర్‌లు, కార్మికులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆంక్షల పేరుతో ఇబ్బందులు తగవు



మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ ఎదుట బైఠాయించిన డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి

● కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి
● మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ ముందు బైఠాయించిన కార్పొరేటర్లు

మైలార్‌దేవ్‌పల్లి: గణేష్ వేడుకల్లో పోలీసులు మండప నిర్వాహకులపై అనవరసపు ఆంక్షలు పెడుతూ ఇబ్బందులకు గురి చేయడం సరికాదని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి అన్నారు. పోలీసుల వైఖరికి నిరసనగా ఆదివారం మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ ఎదుట బీజేపి కార్యకర్తలు, మండప నిర్వాహకులతో బైఠాయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణేష్ నవరాత్రుల్లో భాగంగా మండప నిర్వాహకులను ఇబ్బందులు పెట్టడం సరికాదన్నారు. వారిపై దాడులు చేయడం దారుణమన్నారు. మండప నిర్వాహకులకు పోలీసులు సహకరించాలని కోరారు. అనంతరం పోలీసులు మండప నిర్వాహకులకు ఇబ్బందులు పెట్టకుండా చూసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించుకున్నారు. కార్యక్రమంలో అత్తాపూర్ డివిజన్ కార్పొరేటర్ మోంద్ర సంగీత,అలే భాస్కర్ ,మల్లారెడ్డి, కొమురయ్య, అడికె జనార్దన్ , బుచ్చిరెడ్డి, నర్సిరెడ్డి పాల్గొన్నారు.